ఆక్రమణలకు దన్ను!



వడ్లపూడిలో అక్రమార్కులకు అనుకూలంగా గెడ్డ నిర్మాణం సాగుతోంది. అధికారపార్టీ నాయకులు, అధికారులు ఒక్కటై అక్కడ ప్రధాన కాలువ రూపురేఖలే మార్చేస్తున్నారు. గెడ్డను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కాపాడడానికి అటు అధికారులు ఇటు కూటమి పెద్దలు ఎవరికి వారు తమ వంతు సహాయం చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే గెడ్డ నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- కూర్మన్నపాలెం

కాలువగోడను సైతం సొంతం చేసుకున్న దృశ్యం



కాలువలో చేపట్టిన నిర్మాణం

అక్రమార్కులకు అనుకూలంగా కాలువ నిర్మాణాలు | **చక్రం తిప్పిన కూటమి నేతలు** | **వంతపాడిన ప్లానింగ్ అధికారులు**

జీవీఎంసీ 87వ వార్డులోని పవన్‌సాయి ఆస్పత్రి వెనుక ఉన్న ఎగువ నుంచి చాకలిపేట మీదుగా జాతీయ రహదారికి వెళ్లే అతి పెద్ద ప్రధాన కాలువ ఉంది. చిన్న చిన్న కాలువల నుంచి వచ్చి చేరే మురుగు నీరు ఈ కాలువలో కలుస్తుంది. దీంతో నిత్యం ఈ గెడ్డ ప్రవహిస్తూనేఉంటుంది. అలాంటి ప్రాంతంలో విశాలమైన కాలువ ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. కొంత మంది పలుకుబడి కలిగిన వారు పక్కా నిర్మాణాలు కూడా చేపట్టేశారు. తాజాగా కూడా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.

హద్దులు తేల్చకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం

అయితే కాలువకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు ఉండవని అధికారులు దాదాపు రూ.4.5 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. టెండర్లు పిలిచారు. 30 శాతం లెస్సుకు టెండర్లు వేయడంతో ఎగువ భాగం అంతా రూ.1.40 కోట్లకు, దిగువభాగం మరో రూ.1.40 కోట్లకు కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. ఇదంతా గత ప్రభుత్వంలో పూర్తయింది. నాటి ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే అంత వరకూ బాగానే ఉన్నా ఇంతలో ప్రభుత్వం మారడంతో కూటమి నేతలు రంగంలోకి దిగి చక్రం తిప్పుతున్నారు. అధికారులు, కూటమి పెద్దలు ఒక్కటై కాలువ అసలు విస్తీర్ణం ఎంతో చూడకుండా... ఆక్రమణల జోలికి వెళ్లకుండా పనులు సాగిస్తున్నారు. ఆక్రమణదారులు దీన్ని అనువుగా చేసుకొని కాలువ గోడలపైనే నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డీల్ కుదరడంతోనే...

స్థానిక కూటమి పెద్దలు కొందరికి ఆక్రమణదారు నుంచి స్థలాన్ని బట్టి రేటు కట్టి వసూలు చేసి ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే అధికారులు కిమ్మనకుండా కూటమి పెద్దలు చెప్పినట్లు చేసుకుపోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇంజినీరింగ్ విభాగం ప్రణాళికా విభాగానికి లేఖ రాసినా కనీసం వారు చూసినట్టు కనిపించడంలేదు. అందుబాటులో ఉన్న యువ అధికారి ఈ పనుల విషయంలో ఏకంగా వ్యవస్థనే తప్పుదారి పట్టించేస్తున్నారని సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు ఉంటే పట్టించుకోమని ప్రైవేటు స్థలాల్లో నిర్మాణాలు చేస్తే చర్యలు చేపడతామని ఆ యువ అధికారి బహిరంగానే సెలవు ఇస్తున్నారు. ఇలా అన్ని విభాగాల అధికారులు, రాజకీయపార్టీ పెద్దలు ఒక్కటై ప్రధాన కాలువను ఆక్రమణలకు అనుకూలంగా నిర్మించి తమ ఉడతా భక్తిని చాటుకుంటున్నారు.



కాలువగోడపైనే నిర్మాణం

నచ్చినట్టు నిర్మాణం



ప్రధాన కాలువ ఎలా ఉందో అలాగే నిర్మించాలి. ఒక దగ్గర వెడల్పు తగ్గించడం మరో దగ్గర పెంచడం సరికాదు. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. వెడల్పు తగ్గించిన దగ్గర నీరు నిలిచిపోయి ఉప్పొంగే అవకాశం ఉంది. దీనిని అధికారులు పరిగణలోకి తీసుకోవాలి.
- ఇల్లపు రాము, వడ్లపూడి

ప్రజావసరాలు పట్టవా?



కోట్లరూపాయలతో నిర్మించే కాలువ ప్రజలందరికీ ఉపయోగపడేలా ఉండాలి. ఎవరికో అనుకూలంగా నిర్మిస్తే ప్రభుత్వ ధనం వృథా అయిపోతుంది. ఈ విషయాన్ని అధికారులు గుర్తించాలి. ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనులు చేపట్టాలి.
- ఎ. సంతోష్, కూర్మన్నపాలెం

ఆక్రమణలు గుర్తించాలని లేఖ రాశాం

ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలువ నిర్మిస్తున్నాం. ఎక్కడ అధికంగా నీరు ప్రవహిస్తుందో దాన్ని దృష్టిలోపెట్టుకొని డిజైన్ చేశాం. గెడ్డపై ఆక్రమణల విషయం మా దృష్టికి వచ్చింది. సర్వేచేసి ఎంత ఆక్రమణకు గురైందో గుర్తించాలని ప్లానింగ్ విభాగానికి లేఖ రాశాం. కాలువగోడపై ఎవరు నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా నేరం. వాటిని వెంటనే తొలగించాలని మరో లేఖ రాస్తా.
- ఎం.ఆర్.ఎస్. అప్పారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, గాజువాక జోన్

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: విద్యార్థుల్లో చిత్రలేఖనంపై ఉన్న ఆసక్తిని గుర్తించి వారికి చిత్ర లేఖనం పోటీలు నిర్వహించామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం విద్యార్థులకు కలర్స్, పేపర్స్ అందజేసి వారితో అందమైన చిత్రాలు గీయించారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న సీపీఎం కార్యదర్శి రాంబాబు

గాజువాక: జీవో 30 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు జీవో 296 ప్రకారం ఇచ్చిన పట్టాలకు హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గాజువాక తహసీల్దార్ కార్యాలయంవద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ స్వతంత్రనగర్, ఎస్టీ కాలనీ, కుంచుమాంబ కాలనీ, రామ్‌నగర్, అప్పన్న కాలనీ, సాయిరామ్ కాలనీల్లో నివాసులకు జీవో 30 ప్రకారం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుందరయ్యకాలనీ, దుర్గానగర్, దశమికొండ, భానోజీతోట, సింహగిరి కాలనీల్లో నివాసులకు గతంలో జీవో 296 ప్రకారం పట్టాలను మంజూరు చేశారని, వాటికి రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, పి.స్వామి, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యసాయి మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సాంస్కృతిక ప్రదర్శనలో బాలవికాస్ విద్యార్థులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. మందిరంలో వేకువజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రుత్వికులు రుద్రాభిషేకం చేశారు. వేదం, విష్ణు సహస్ర నామపారాయణ, సత్యసాయి అష్టోత్తరం అనంతరం ప్రత్యేక నామ సంకీర్తన నిర్వహించారు. అనంతరం బాలవికాస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి కన్వీనర్ జి. రామకృష్ణ, జై గణేష్, జయ గౌరి కామేశ్వరి, శ్యామ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



టెర్రస్ మీద నుంచి దూకిన వైష్ణవి

కూర్మన్నపాలెం: అపార్ట్‌మెంట్ టెర్రస్ మీద నుంచి దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. దువ్వాడ పోలీసులు అందించిన వివరాలు.. అగనంపూడి గల్లవానిపాలెం వైష్ణవి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న గుడ్ల కమలకుమారి (58) మేడ మీద నుంచి దూకడంతో గేటు మీద పడిపోయింది. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవల ఆమె భర్త మురళీకృష్ణ అకస్మాత్తుగా మరణించడంతో తమ సొంతూరు తీసుకువెళ్లి అన్ని కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈనెల నాలుగో తేదీన గల్లవానిపాలెం చేరుకున్నారు. ఈ రోజు ఉదయం దూకినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి సీఐ మల్లేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పోరాటానికి డీవైఎఫ్ఐ మద్దతు



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల దీక్షకు మద్దతు తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

సీతంపేట: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వోలు) చేస్తున్న పోరాటానికి మంగళవారం డీవైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీహెచ్‌వోలు చేస్తున్న నిరసన దీక్షలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు ప్రసంగిస్తూ గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను వేధించడం తగదు అన్నారు. వారి న్యాయమైన డిమాండ్లు అయిన ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారి ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, గత ఏడు నెలలుగా బకాయి ఉన్న ఇన్సెంటివ్‌లు చెల్లించాలని, ఈఈఎఫ్‌వో పునరుద్ధరించాలని, ఎఫ్ఆర్ఎస్‌లో మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సంతోష్ కుమార్, ఉమా శైలజ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పేరుతో భారీ అవినీతి



తహసీల్దార్ శ్రీవల్లికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విచారణకు డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ వినతి

గాజువాక: బీసీ కులాలకు కుట్టు మిషన్లు, శిక్షణ రాష్ట్రంలో పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఈ అవినీతిపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు మంగళవారం గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ విభాగం గాజువాక అధ్యక్షుడు చిత్రాడ వెంకట రమణ, మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లా చినతల్లి మాట్లాడుతూ కుట్టు మిషన్లు, శిక్షణ పేరుతో కూటమి ప్రభుత్వం రూ.245 కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డి.గౌస్, నాయకులు కొయ్య భారతి, పల్లా పెంటారావు, రామలక్ష్మి, స్వాతి, బొడ్డ గోవింద్, సంతోష్, వెంకట సూరి, ఆడారి శ్రీనివాసరావు, చిత్రాడ కనక సూర్య పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం సబ్‌స్టేషన్ పరిధిలో సర్క్యూట్ బ్రేకర్ల భర్తీ

పెదగంట్యాడ: గంగవరం సబ్ స్టేషన్ పరిధిలో 220 కేవీ సర్క్యూట్ బ్రేకర్ల భ భర్తీ పనులను ఈ నెల 7 నుంచి 9 వరకూ చేపట్టనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెదగంట్యాడ, చిన గంట్యాడ, గంగవరం, కూర్మన్నపాలెం, కర్నవానిపాలెం, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయనున్నామని వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదని పేర్కొన్నారు. ఒక వేళ సరఫరా నిలిచిపోతే వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతగా నిలిచిన జట్టుతో వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవన కార్యాలయాల సిబ్బంది మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నియాన్ గ్రీన్ కలర్స్ జట్టు విజయం సాధించింది. బ్లూ బ్లాస్టర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ విజేతలకు, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. గ్రీన్ థండర్స్ మేనేజర్ డా.పి.వి.ఎస్.ఎన్.వి.సాంబమూర్తి, కెప్టెన్ పి.రాజేంద్ర ప్రసాద్, బ్లూ బ్లాస్టర్స్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్, కెప్టెన్ కె.సంతోష్ కుమార్ , ఇతర క్రీడాకారులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనంజయరావు పాల్గొన్నారు.

కేకేరాజుకు ఆత్మీయ సత్కారం



కేకే రాజును సత్కరిస్తున్న నాగిరెడ్డి తదితరులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కలిసేందుకు వచ్చిన రాజుకు నాగిరెడ్డి, పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తాజా రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు రాజాన వెంకటరావు, ఎస్.ఎం.డి.గౌస్, పల్లా పెంటారావు, మంత్రి శంకరనారాయణ, భూపతిరాజు శ్రీనివాసరాజు, జీలకర్ర నాగేంద్ర, చిక్కా సత్యనారాయణ, బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిని కలిసిన అనంతరం కేకే రాజు గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్యను కలిశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఈనెల 9న ప్రమాణ స్వీకారం చేయనున్నానని, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, ఇల్లపు రాము, ముద్దపు దామోదర్, సబ్బవరపు ఈశ్వరరావు, కర్రి నాగేశ్వరరావు, గుంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాయి బాటలో బాలలు నడవాలి



డాక్టర్ భారతిని సత్కరిస్తున్న అగనంపూడి సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

అగనంపూడి: బాల్యం నుంచే సత్యసాయి బాబా బాటలో పయనించి నైతిక విలువలు, ఆధ్యాత్మిక విలువలతో జీవించాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. సత్యసాయి భజన మండలి అగనంపూడి సారథ్యంలో మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి వారోత్సవాల్లో భాగంగా బాల వికాస్ చిన్నారులనుద్దేశించి ఆమె మాట్లాడారు. సత్యసాయి సూచించిన మార్గంలో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సత్యసాయి భజన మండలి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందుతున్న డాక్టర్ భారతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిన్నారులు పలు కార్యక్రమాలు ప్రదర్శించారు. నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, సత్యసాయి భజన మండలి కన్వీనర్ విందుల పైడినాయుడు, ఆధ్యాత్మిక విభాగం కోఆర్డినేటర్ విందుల రామారావు, రమాదేవి, ఓలేటి సాయి సరస్వతి, పద్మలత, బి.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి



నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలు, తీపి గుర్తులను తలచుకొని మురిసిపోయారు. రెండున్నర దశాబ్దాల కిందట లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం మంగళవారం సందడిగా సాగింది. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి వారి సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో నాటి గురువులు శ్రీధర్‌రెడ్డి, రౌతు నాగేశ్వరరావు, కలగా రమణ, పండా శ్రీనుతో పాటు పూర్వ విద్యార్థుల కార్యనిర్వాహక కమిటీ ప్రతినిధులు గొంతిన నరసింగరావు, సాలాపు శ్రీనివాసరావు, కె.వసంత్‌కుమార్, కె.సంతోష్‌కుమార్, ఎ.ఆదిత్య, ఎ.గణేష్, ఎస్. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. – అగనంపూడి

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఏ త్యాగానికైనా సిద్ధం

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి



దీక్షలో కూర్చున్న షర్మిలారెడ్డి

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడడానికి ఎటువంటి త్యాగానికైనా సిద్ధమేనని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ప్రకటించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో మంగళవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో కర్మాగానికి ఒక చేతిలె ఆర్థికసాయం చేసి మరో చెయ్యితో లాక్కుందని విమర్శించారు. ఈ నెల 20న నిర్వహించనున్న సమ్మెలోపు కాంట్రాక్టు కార్మికులను పనిలోకి తీసుకోవాలని.. లేకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి కూడా వెనుకాడనని ప్రకటించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దీక్షలో కూర్చొన్నారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు నిమ్మరసం అందించడంతో ఆమె దీక్ష విరమించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్, అధినారాయణ, కాంగ్రెస్ నాయకులు ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.సి.రెడ్డి

సీతంపేట: గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రచించిన శోధన, పరిశోధన పుస్తకావిష్కరణ కార్యక్రమం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం జరిగింది. ప్రొఫెసర్ కె.సి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ నేటి సమాజానికి అవసరమైన ఆలోచనాపరుడు, తత్వవేత్త అని కొనియాడారు. బాలమోహన్‌దాస్ రచించిన సంకలనంలో విభిన్న రంగాలకు సంబంధించిన విషయాలను కూలంకషంగా పొందుపరిచారని తెలిపారు. రచయిత తన కెరీర్‌లో అనుసరించిన సూత్రాలను ఈ సేకరణలో పొందుపరిచినట్టు తెలిపారు. సభాధ్యక్షుడు, బుల్లయ్య కళాశాల సెక్రటరీ జి. మధుకుమార్ మాట్లాడుతూ బాలమోహన్‌దాస్ సమాజాన్ని మేధోసంపత్తితో సుసంపన్నం చేసే దిశగా వ్యాసాలను పొందుపరిచి విలువైన సంపుటిగా తీర్చిదిద్దారని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఈ వ్యాసాలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. బొబ్బిలి రాజా కళాశాల మాజీ ఆంగ్ల విభాగాధిపతి వినయభూషణరావు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆండాల్ అమ్మిశెట్టి, డాక్టర్ కె.కుమార్‌రాజా, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరోధమే లక్ష్యం



పోస్టర్ విడుదల చేస్తున్న చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ ప్రకాష్ తదితరులు

మహారాణిపేట: అవినీతి నిరోధానికి ముందస్తు చర్యలపై ప్రజలు, ఉద్యోగుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో విశాఖ పోస్టల్ డివిజన్ ప్రత్యేకంగా విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. దీనిపై వెలంపేట హెడ్ పోస్టల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ జనరల్లు డీఎస్‌వీఆర్ మూర్తి, పి.ఉపేంద్ర, డైరెక్టర్ (హెడ్ క్వార్టర్స్) గజేంద్ర కుమార్ మీనా, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసు పి.కోమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.